


క్రట్ కట్ కట్ రట్ ....రట్ ర్రర్రర్రరట్! నోనోసార్ ఇజ్జూస్తే—ఐమీన్, సెన్సారువాళ్ళిజ్జూస్తే ఇంకేమన్నా ఉందాసార్! కొంపలు మునిగిపోవూ? మళ్ళీ ఇంకో టేక్ తీద్దాం. ఆ కాఫీకప్పు అందించినపుడలా వేళ్ళు తగల్కుండి. జాగ్రత్త. మీదెంత మేనరికమైనా ఇంకో రెండు రీళ్ళలో మీరెంత దీనిగా ఎంత ఫెళ్ళుమనేలా పెళ్ళాడబోతున్నా ఈ రీల్లో అలా ఒకళ్ళనొకళ్ళు తాకోకూడదు. కాఫీ ఇస్తున్నపుడేనా సరే. వళ్ళు తగిలితే వెంటనే ఛీ ధూర్తుడా! అవివాహిత భారతబాలికను తాకుతావా? అని మేనగోడలు అనాల్సివస్తుంది. లేపోతే ఇద్దరూ అగ్నిప్రవేశం చేసి

ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. లేకపోతే సెన్సారువారు ఒప్పుకోరు. రీలు తగలేయించేస్తారు దగ్గిరుండి.

నో సార్ నో... యస్సార్ యస్. మీరుచూళ్ళేదా? కొత్త సెన్సారింగు సర్క్యులర్సూ? కొత్తరూళ్ళొకట్ర లొచ్చాయి. పెళ్ళికానివారిద్దరు ఒకళ్ళ నొకళ్ళు ముట్టేసుకోకూడదు. యస్... నో డ్యూయెట్ డాన్సెస్. నో లవ్ సీన్సు. ప్రేమ పాటలు తీసినా మన సినిమాలను పురాతన పద్ధతుల్లోనే తీయాలన్నమాట. అనగా ఆవిడ సాంగు మొదలెట్టి పరిగెడుతుంది. పొదలచుట్టూ, దుబ్బులచుట్టూ, కుర్చీలచుట్టూ, స్తంభాలచుట్టూ—హీరోగారూ కూతవేటు దూరంలోనే ఉంటూ పాడుతూ అభినయం పట్టాలి. అంతే ఆర్టు గీర్టూ అని కొత్తపద్ధతులు తెచ్చిందికి వీల్లేదు. యస్సార్. యస్. పెళ్ళి చేసుకునేవరకూ అంతే. అంతెందుకు. పెళ్ళి జరుగుతున్నపుడుకూడా పుస్తెల తాడుకి మూడోముడి పడేవరకూ పెళ్ళికొడుకువేళ్ళు పిల్లదాని జడగ్గాని, మెడగ్గాని తగల్రాదని సెన్సారు శాసనం. తగిలిందే సెన్సార్రూళ్ళకట్ర ప్రొడ్యూసరు నెత్తిన రంగునపడిందే. అది రేప్ అనగా బలాత్కారం క్రిందకు వస్తుంది. అంతేమరి. మూడో ముడి పడేదాకా టెక్నికల్‌గా పెళ్ళయినట్టు కాదుగదా? వ్వాట్? హార్గ్యూ చేస్తారా? మైగాడ్. ఆర్గ్యుమెంట్లూ లాజిక్కులూ పనికిరావుసార్. రూలంటే రూలే. సెన్సార్ రూలంటే మరీను... అంతెందుకూ, ఎక్సప్రొడక్షన్సువాళ్ళ పిక్చరులో మొన్న నేంచేశాం? హీరోయిను నూతిలో పడింది. హీరో ఆవిడను సేవ్ చెయ్యాలి. పెళ్ళికాలేదు. హా! దట్ వాజ్ ది

ప్రాబ్లెం. వెంటనే పురోహితుణ్ని, హీరోయిను ఫాదర్నీ కేకే యించుకొచ్చి నూతిలోదించి, "ఇయం సీతామనుసుతా...." ముక్కలు మూడూ అనిపించి, అప్పుడు హీరోచేత సూత్రం ముళ్లూ వేయించాం—ఆవిడ మూడో గుటక వేసేలోగా. మళ్ళీ టైముండదని పుస్తెలతాడు బదులు పెద్ద పలుపు తాడుతోనే ముళ్లు వేయించి ఆ తాడుతో హీరోగారిచేత ఆవిడని పైకి లాగించాం.

అఫ్కోర్సు మనకి నా వెల్టి కూడా కలిసొస్తుంది. నూతిలో పెళ్ళి....కొత్తగా లేదూ, అయిడియా మరి? సెక్సు, రెలిజను, ఎడ్వెంచరు, సస్పెన్సు, రొమాన్సు ఇన్ని కలిసొచ్చాయి. సెన్సారు రూళ్ళుకూడా కొరకపూలిన వనిందికి వీల్లేదు... మళ్ళీ ఎక్కడా అనకండి. మన్లో మన మాట. -బుచ్చమ్మ అని ఒక బ్యూటిఫుల్ యంగ్ విడో ఉండేది. ఆవిడ నన్ను ద్వాహమాడటానికి నాతో లేచి వెళ్ళిపోయిరావడానికి ఆరంభంలో ఒప్పుకుంది గాదు. చివరికామెను దాదాపు ఒప్పించడానికి నేను వేసిన ప్లాను ఎలాంటిదనుకున్నారు? అక్షరాలా ఇలాటిదే.

"వదినా! మొన్న మీ అమ్మగారు నూతిలో దూకారు. ఆవిడకీ మారేజయింది. నాకూ నేడు7నాపోతే పూర్వం ఒకప్పుడైనా మారేజయింది. గాబట్టి నేనూ నూతిలో దూకి ఆవిణ్ణి పైకిలాగి సేవ్ చేసినా సరిపోయింది. ఢిల్లీలోని 13 వేల తల్లులుగాని, సర్వోదయ వాళ్ళుగాని, మున్షీ మొరార్జీ, రాజాజీలు గాని, ఆఖరికి సెన్సారువాళ్ళు గాని తప్పట లేకపోయారు.... మరదే రేపొద్దున్న మీరు గాలాజ

ఆ నూతిలోనే పడతారనుకోండి. పడ్డాక, అన్నా ఎంత పనయిపోయింది. హాయిగా ఆ గిరీశంగార్ని చేసుకుని మహారాణిలా ఉండాల్సిందని నాలిక్కరుచుకొంటారు. నేను మిమ్మల్ని చూచినా దూకి రక్షించడానికి వీల్లేదుగదా? మనకి పెళ్ళికాలేదు మరి? ఒకవేళ ప్రాణరక్షణ అని వంక పెట్టినా,——వెధవది మానవదేహంలో ఉండి——లోలోపల నేనుగాని, మీరుగాని ఆయొక్క మధురస్పర్శవల్ల ఆ అవాంతర స్థితిలోనే ఏ కాస్తయినా ఆనందం పొందినట్టాయెనా——కొంప మునిగిపోతుంది. సెన్సారడకత్తెర మన పీకెలుత్తరిస్తుంది. గాన ముందే మారేజి చేసుకుని రడీగా ఉండడం మంచిది." ఆవటాని ఒక గంభీరమైన లెక్చరిచ్చేశాను. 'అంతే సంఛారా? గిరీశంగారూ!' ఆవటాని ఆ యంగ్ విడో ముక్కున వేలేసుకుని సాలోచనగా చూస్తూ నిలబడిపోయింది.

యూవంటారూ —— ఈ రూళ్ళను వంచలేమా అంటారా? చిత్తం డొంకతిరుగుళ్ళుంటూనే ఉంటాయి. పెళ్ళి జరగడానికి ముందు రొమాన్సు ఉండరాదని, ప్రేమికులు ఒకళ్ళ నొకళ్ళు తాకరాదని రూలు కదా. మొన్న అల్లా పిక్చరదేవిటీ....అందులో పెళ్ళి సీనులు ముందర షూట్ చేశారు. ప్రేమ సీనులు తరవాత తీశారు. కథలో ప్రేమ ముందు, పెళ్ళి వెనకా వస్తాయనుకోండి. అయినా రూలు ప్రకారం పెళ్ళే ముందుగా తీశామని సెన్సారు వాళ్ళకి చెప్పబోతున్నారు. ఒప్పుకుంటార్లెండి

అయినా కాపోయినా అన్నిటికీ ఊరికే వాళ్ళ నలా ఆడిపోసుకోడం సబబుకాదు. వాళ్ళ రూళ్ళు దయాదాక్షిణ్యాలు చూపించిన సందర్భాలెన్ని లేవు.

ఓ పిక్చర్లో విలను నానాఘోరాలు చేస్తాడు. దొంగతనం, దౌర్జన్యం, ఒక చిన్న **ఖూనీ**, ఒక బలాత్కారం, రెండు ఫోర్జరీలు—ఇన్ని చేస్తాడు. తీరా కథ అయిపోయి జనాభా అంతా గ్రూపు ఫోటో దిగేవేళకు పోలీసు లొచ్చేస్తారు విలన్ని తీసుకుపోడానికి. అప్పుడు విలను భార్య ఏమంటుంది? "ఆయన నా భర్త. నా పసుపుకుంకాలు బాగుండనీయండి. నన్ను చంపిగాని ఆయన్నరెస్టు చెయ్యడానికి పీల్లేదు. భారతనారి తన భర్త నలా పోలీసులపాలు చెయ్యదు" అంటుంది పెద్ద కుంకుంబొట్టు పెట్టుకుని, పుస్తెలు (మాత్రమే) పైట ఇవతలికి కనబడేలా ఏర్పాటు చేసుకుని.

అప్పుడు హీరో ఔదార్యం చూపిస్తాడు. "ఓ విలనూ నీవల్లగదా నా ధైర్య సాహసాలూ, మా ఆవిడ పాతివ్రత్యం రుజువయ్యాయి. కాన నీకు మేము ఋణపడున్నాం. భయపడకు... ఓ పోలీసులూ! కేసులేదు. మేం ఫిర్యాదు చెయ్యం. వాణ్ణొదిలేసి పోండి" అంటాడు.

పోలీసులు యస్సార్ అని వదిలేస్తారు. సెన్సారు వాళ్ళు వదిలేస్తారు. వాళ్లు కావాలంటే పేచీపెట్టరా ? కాని అవతల మహాపతివ్రత సిఫార్సాయె. గ్రేట్ సెంటిమెంట్. అదిచూసి వదిలేస్తారు. మన ఫిలింవాళ్లు కృతజ్ఞత లేకుండా వాళ్ల ఉపకారాలు మర్చిపోయి సభలో రస

భసలూ చేస్తున్నారు. దిస్ ఐ టెల్ యూ—ఈజ్ బేస్ ఇన్గ్రాటిట్యూడ్.

రైటే. రైటేనండి. విలనుగారన్నట్టు పెళ్ళయ్యాక ఇంకా ప్రేమేమిటి. లవ్ సీన్సేమిటి—తరవాత మొగుడూ పెళ్లాలు ఒహాళ్లనొహాళ్లు ముట్టుకుందికి మధ్య సెన్సారువాళ్ల పర్మిషనేమిటి. పర్మిషనుగాదు పది లక్షలిచ్చినా పాటలు పాడుతూ ఒకళ్ళనొకళ్లు తాకి పులకలెత్తి నవ్వి ఆనంద పడమంటే ఛస్తే పడరు. పడలేరు చల్లావణ్ణం తిన్నతరవాత పచ్చడో, పప్పో కలుపుకున్నట్టుఇపుడురొమాన్సే విసార్ ఛష్టుం టేను అంటారు. రైట్, బట్ వెయిటేమినిట్. ఒక్కనిముషం ఆగి ఆలోచించండి. ఈ కాస్త పాయింటు ఆరూళ్లు పెట్టిన వాళ్ళకి, సెన్సారువాళ్ళకీ తెలీదనే అనుకుంటున్నారా? అస ల్నన్నడిగితేఈరూలుకీఫామిలీప్లానింగుకమీషన్‌కీ సంబంధం ఉందంటాను. ఇది చాలా లోతైన వ్యవహారం. బీదవాడి ఏకైక ఎంటర్టయిన్‌మెంటుకి ఈ సినిమాలు, వీటిలో ప్రేమ ఘట్టాలూ, ఈపోస్టర్లూ దోహదాలుగా ఉంటున్నాయనీ, పబ్లిసిటీ సాధనాలుగా పనిచేస్తున్నాయనీ వాటివల్లనే జనాభా ఊహకు పెరిగిపోతోందనీ వాళ్ళ అనుమానం. అందువల్ల భర్త కంట్రోలు, భార్య కంట్రోలు బాగా అమలుచేసి కుటుంబనియంత్రణం, సంతానవిరోధం జయప్రదం చెయ్యాలంటే సినిమాలను బాగా అదుపుచెయ్యాలి. సినిమాలో పెళ్ళికిముందు ప్రేమఘట్టాలు తీయించేస్తే, పూర్వంలా ప్రేక్షకులు తమ పెళ్ళిళ్ల ముందటి ప్రేమ

ఘట్టాల ముచ్చట్లు గుర్తుకు తెచ్చుకుని ఊహించుకొని ఉత్సాహపడడం మానేస్తారు. దీనికి తోడు పెళ్ళైన తరవాత ప్రేమఘట్టాలు చూపెడితే, "ఎంతజడ్డిగా ఉన్నాయి! పెళ్ళయ్యాక కూడా వీడు రోమాన్సూ డూయెట్లు అఘోరిస్తున్నాడు" అని నవ్వుకుంటారు. వాళ్ళు నవ్వుకుంటే సినిమా వాళ్ళు దరిమిలాను అసలు పిక్చర్లలో లవ్‌సీన్లే పెట్టరు. ప్రేమ అవుటాఫ్ ఫాషను, అవుటాఫ్ డేటూ అయిపోతుంది. నీతులు, ఆవాలూ, నీతులు, మెంతులూ నీతులు, జబ్బులు, నీతులు ఏడుపులూ, అపోహలూ నీతులు వగైరాలతో నిండిపోతాయి పిక్చర్లు. జనం హాయిగా ఇళ్ళలో కూర్చుని భారతీయ విద్యాభవన పుస్తకాలు చదువుకుంటారు-- రామాకృష్ణా అనుకుంటూ... కాని అది చాలా ప్రమాదమనీ, అందువల్ల వీళ్ళు నివారించదలుచుకున్న సమస్య మరింత పట్టపగ్గాలేకుండా పోతుందనీ గ్రహించలేరు.

ఇదంతా జరుగుతుందని కాదుస్మండీ. సినిమా వాళ్ళం. అసాధ్యులం. రూలుఉంటే నాలాటి అద్భుతమైన బుర్రలు కిరాయికొచ్చి రూలునీ గీలునీ ఎగరకొట్టేస్తాయి. సవాలక్ష ఉపాయాలు చెప్తాన్నేను. పెళ్ళికిముందు ప్రేమ కూడదు అన్న వాక్యంలో పెళ్ళి అనగా ఏ పెళ్ళి? సనాతన భారతీయ సాంప్రదాయిక వివాహాలున్నాయిరామరి. గాంధర్వం, రాక్షసం వగైరాలు.

భారత సంస్కృతి సంప్రదాయ సంరక్షకులు వాటిని కాదనగలరా?

గుళ్ళో గాంధర్వప్పెళ్ళాడితే కాదంటం సబబా?

అక్కడి దీపం అగ్నిసాక్షి గాదా?

కావాలంటే అగ్నిదేవుడు ప్రత్యక్షమైనట్లు చూపిస్తే పోదా?

ఒకడి భార్యా, ఒకర్తె భర్తా—ఇద్దరూ వివాహితులే కాబట్టి—ప్రేమించి డూయెట్లు పాడడం అధర్మమా?

పెళ్ళయిన పిల్లదానికి కలొచ్చి అందులో మొగుడూ తనూ పెళ్ళిగాకముందు సరసాలాడినట్లు కనబడడం సెన్సార్ పక్షం అనిపించుకోదా?

విష్కంభంలో రిజిష్టరు పెళ్ళి చేసుకొచ్చి డూయెట్లు గట్రా పాడి సరసాలాడి తరవాత సెన్సారువాళ్ళు ఆయ్ అంటే, మాకు రిజిష్టరు పెళ్ళయుండొచ్చు. కావాలంటే ఇపుడు సివిలు పెళ్ళాడతామోచ్చి అంటే అది సెన్సారు పక్షం అనిపించుకోదా!

తెలుగు సినిమాలో లవ్ సీన్సు గొడ్డు (పాపము శమించుగాక) పోతాయా?

మిగతా కథ వెండితెరమీద చూడండి.

